
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం : 9 మార్చి : 2024



సోమశిలలో 14.393 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 14.393 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3,000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.67,640
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,074
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,256
నవర (8 గ్రాములు)	రూ.50,048

గరిష్టం/కనిష్టం 35.2 /24.2

వాతావరణం

శుక్రవారం గాలిలో తేమ 66 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. శనివారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకుడిగా ధనుంజయరెడ్డి



కొడవలూరు ధనుంజయరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకుడిగా కొడవలూరు ధనుంజయరెడ్డిని నియమిస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం రాత్రి ప్రకటన వెలువడింది.

గురుకులాల్లో ప్రవేశానికి పరీక్ష రేపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల కోఆర్డినేటర్ హేమలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్ ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5వ తరగతిలో 640 సీట్లకు గాను 2,056 మంది, జూనియర్ ఇంటర్‌లో 480 సీట్లకు గాను 2,346 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, జూనియర్ ఇంటర్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. హాల్‌టికెట్లను సంబంధిత వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

నవ దంపతుల నేత్రదానం



నేత్రదాతలు కొప్పల ప్రశాంత్ - పుష్పల పెళ్లి ఫొటో (ఫైల్)

నెల్లూరు(అర్బన్): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నవ దంపతుల నేత్రాలను వారి కుటుంబ సభ్యులు దానం చేశారు. నెల్లూరు నగరానికి చెందిన కొప్పల ప్రశాంత్ - పుష్పలకు వివాహమై కేవలం నెల రోజులు కావస్తోంది. గురువారం జాతీయ రహదారిపై చెముడుగుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈ దంపతులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ కుటుంబం తీవ్ర విషాదంలో ఉన్నప్పటికీ తమ బిడ్డల నేత్రాలను దానం చేసింది. ఏసీఎస్‌ఆర్ ప్రభుత్వ ఆస్పత్రి ఐ బ్యాంక్ సిబ్బంది వారి నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్ అందించారు. శుక్రవారం నేత్ర సేకరణ టెక్నీషియన్ లాలేష్, నేత్రదాన మోటివేటర్ బాలాజీసింగ్ మాట్లాడుతూ ఇరువురి నేత్రదానం ద్వారా మరో నలుగురు అంధులకు చూపు లభిస్తుందన్నారు. నేత్రదానం చేయదలచిన వారు 99481 64781, 93471 11033 ఫోన్‌నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

సీతాలక్ష్మి సైతం



సీతాలక్ష్మి (ఫైల్)

నెల్లూరులోని బారకాసు ప్రాంతానికి చెందిన సీతాలక్ష్మి(54) గురువారం రాత్రి గుండెపోటుతో మృతిచెందగా కుటుంబసభ్యుల అనుమతితో నెల్లూరు ప్రగతి లయన్స్ క్లబ్ సహకారంతో సిబ్బంది ఆమె నేత్రాలను సేకరించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు నేత్ర దాన సర్టిఫికెట్ అందించారు.



నెల్లూరు మూలస్థానేశ్వర ఆలయ ఆవరణలో మంజునాథునికి అభిషేకం చేస్తున్న భక్తులు



మనుబోలు మండలం బద్దెవోలు సంగమేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణం



మూలస్థానేశ్వర ఆలయ ఆవరణలో మహాదేవునికి నమస్కరిస్తున్న చిన్నారులు

హరహర మహాదేవ

మహాశివరాత్రి పర్వదినాన్ని శుక్రవారం జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శైవక్షేత్రాలు పరమేశ్వరుని నామస్మరణతో మార్మోగాయి. ఓం నమఃశివాయ.. హరహర మహాదేవ శంభోశంకర.. అంటూ భక్తులు భోళాశంకరుడిని స్మరించుకున్నారు. జిల్లాలోని నెల్లూరు మూలస్థానేశ్వర ఆలయం, నవాబుపేట శివాలయం, జొన్నవాడలోని కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి ఆలయం, సోమశిలలోని సోమేశ్వరస్వామి ఆలయం, తోటపల్లిగూడూరు మండలంలోని కాటేపల్లి శివాలయం తదితర శైవక్షేత్రాల్లో మహాదేవునికి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. పార్వతీ పరమేశ్వరులకు కనులపండువగా కల్యాణోత్సవం జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్, ఫొటోలు – సాక్షి ఫొటోగ్రాఫర్



ప్రగతి కొత్త పుంతలు

- పూర్తవుతున్న రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్ల నిర్మాణం
- ఇప్పటికే రైలు, రోడ్డు మార్గాల్లో సరుకుల రవాణా
- సముద్ర మార్గాన్నీ అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం
- యువతకు భారీగా ఉపాధి అవకాశాలు
- భూముల ధరలకు రెక్కలు

పారిశ్రామికవాడగా కావలి అభివృద్ధికి అడుగులు

అభివృద్ధి పరంగా అన్ని అనుకూలతలున్న కావలి పట్టణం ఇప్పటికే వస్త్ర వ్యాపార రంగంలో దూసుకుపోతోంది. ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తే తీర ప్రాంత మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని ప్రభుత్వం భావించింది. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం వీటి నిర్మాణ పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయి. ఇవి త్వరలో అందుబాటులోకి రానుండడం, అలాగే ఈ ప్రాంతంలో అనుబంధ పరిశ్రమలు కూడా ఏర్పాటు కానుండడంతో వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. వీటన్నింటి ఏర్పాటుతో ఈ ప్రాంతంలో ప్రగతి కొత్త పుంతలు తొక్కుతోంది.

కావలి: సుమారు 700 హోల్‌సేల్, రిటైల్ దుకాణాలతో వస్త్ర వ్యాపారంలో రెండో ముంబైగా పేరొందిన కావలి పట్టణం మరింత అభివృద్ధి చెందేలా వడివడిగా అడుగులు పడుతున్నాయి. తాజాగా కావలి సమీపంలో రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, అనుబంధ పరిశ్రమలు ఏర్పాటవుతుండడంతో ఈ ప్రాంతం పారిశ్రామిక కేంద్రంగా మారనుంది. రైలు, రోడ్డు, సముద్ర మార్గాలతోపాటు వాయు మార్గంలో కూడా రవాణాకు కావలి అనుకూలంగా ఉండడంతో ఈ ప్రాంతాన్ని రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికవాడగా అభివృద్ధి చేస్తోంది. 20 నెలల్లో రూ.3,736 కోట్లతో రామాయపట్నం పోర్టు, 26 నెలల్లో రూ.288.8 కోట్లతో బోగోలు మండలంలో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు 98 శాతం పూర్తి చేసింది. వీటితోపాటు సరుకు రవాణాకు వీలుగా 1,861.2 ఎకరాల విస్తీర్ణంలో రూ.368 కోట్లతో దగదర్తి మండలం దామవరం వద్ద కార్గో విమానాశ్రయ ఏర్పాటుకు ప్రభుత్వ ప్రతిపాదనలు తుది దశకు చేరుకున్నట్లు తెలిసింది. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ అందుబాటులోకి వచ్చిన తరువాత పోర్టు ఆధారిత అనుబంధ పరిశ్రమలు, మత్స్యసంపదను ఎగుమతి చేసేందుకు, ప్రాసెస్ చేసేందుకు అవసరమైన ఇతర పరిశ్రమలు ముమ్మరంగా ఏర్పాటయ్యే అవకాశం ఉంది. అలాగే గూడ్సు రైళ్లల్లో సరుకు రవాణా, నిర్వహణ, గోదాముల ఏర్పాటుతో బిట్రగుంటలో కూడా రైల్వేపరంగా కొత్త ప్రాజెక్టులు ఏర్పాటయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో రానున్న ఐదారేళ్లలో కావలి నియోజకవర్గంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభించే అవకాశాలు పుష్కలంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

పెరుగుతున్న భూముల ధరలు

కావలి ప్రాంతంలో పారిశ్రామిక ప్రగతితో నియోజకవర్గంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. హైవే పక్కన గతంలో ఎకరా భూమి రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షలు ఉండగా, ప్రస్తుతం రూ.2 కోట్ల మేర ధర పలుకుతోంది. రానున్న రోజుల్లో కూడా భూముల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉండడంతో రైతులు తమ భూములను విక్రయించేందుకు ఆసక్తి చూపడం లేదు. హైవేకి దూరంగా చెరువుల ఆధారంగా వరి పండే భూములు కూడా ఎకరా రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు చెబుతున్నారంటే ప్రస్తుతం భూములకు ఉన్న డిమాండ్ అర్థం చేసుకోవచ్చు. అలాగే పట్టణాల్లో ఇళ్ల ప్లాట్ల ధరలు కూడా భారీగా పెరిగాయి. కావలి పరిసరాల్లో గత మూడేళ్లలోనే 30 శాతం మేర అదనంగా పెరిగినట్లు సమాచారం. మరోవైపు కొత్త లేఅవుట్లు కూడా గతంతో పోలిస్తే 80 శాతం అదనంగా పెరిగాయి. ఇవన్నీ భవిష్యత్ ప్రగతికి నిదర్శనంగా కనిపిస్తున్నాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా..

వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మత్స్యకార గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. వలసల నివారణతోపాటు మత్స్యసంపద ఎగుమతులను ప్రోత్సహించేందుకు వీలుగా ఫిషింగ్ హార్బర్, పోర్టు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. రామాయపట్నం వద్ద రూ.3,736 కోట్లతో పోర్టును నిర్మిస్తోంది. పోర్టు అందుబాటులోకి వచ్చిన తరువాత ప్రత్యక్షంగా, పరోక్షంగా 15 వేల మందికి పైగా యువతకు ఉపాధి లభించే అవకాశం ఉంది. అలాగే జువ్వలదిన్నె వద్ద 1,250 బోట్లు నిలిపే సామర్థ్యంతో రూ.288.8 కోట్లు వెచ్చించి ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపడుతోంది. ఈ హార్బర్ అందుబాటులోకి వచ్చాక సుమారు 6 వేల మంది మత్స్యకారులకు ప్రత్యక్షంగా, మరో 5 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉంది. ఎగుమతుల ద్వారా మత్స్యసంపదకు కూడా సరైన ధర లభించే అవకాశం ఉండడంతో మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించనున్నారు. వీటితోపాటు అనుబంధ పరిశ్రమల ద్వారా వేలాది మందికి ఉపాధి లభించనుంది. ఇప్పటికే రామాయపట్నం, జువ్వలదిన్నె ప్రాంతాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. దుకాణ సముదాయాలు, వ్యాపారాలతో కొత్తరూపు సంతరించుకున్నాయి. అలాగే రామాయపట్నం – చెన్నై మధ్య పారిశ్రామిక కారిడార్ తరహాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుండడంతో సరుకు రవాణాకు వీలుగా దగదర్తి మండలం దామవరంలో కార్గో సేవల విమానాశ్రయ ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.



బోగోలు మండలంలో నిర్మాణంలో ఉన్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్

గత ప్రభుత్వంలో అలా..

సముద్రంలో వేటే జీవనాధారంగా బతికే మత్స్యకారులు గత ప్రభుత్వంలో నిత్యం ఉపాధి కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డారు. సముద్రంలో మత్స్యసంపద తగ్గిపోవడం, ఎగుమతులకు సరైన వనరులు లేకపోవడం, అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడం తదితర కారణాలతో తీరంలో వలసలు గణనీయంగా పెరిగాయి. సుమారు 55 శాతం మంది మత్స్యకార యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు తెలిసింది. తమిళనాడు, కర్ణాటక, గుజరాత్, పుదుచ్చేరి, ముంబై తదితర ప్రాంతాల్లోని బోట్ల యజమానుల వద్దకు కూలీలుగా వెళ్లి పొట్టపోసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మరోవైపు మత్స్యకార గ్రామాల్లో చాలీచాలని వసతులతో స్థానికంగా ఉండే గంగపుత్రులు అవస్థలు పడేవారు.

జీవన ప్రమాణాలు మెరుగవుతాయి



కావలి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి శ్లాఘనీయం. కావలికి సమీపంలో రామాయపట్నం పోర్టు నిర్మాణం ద్వారా మరింత అభివృద్ధి జరగాలని కోరుకుంటున్నాం. తద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లభించి వారి జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. ఉదయగిరి, ఆత్మకూరు, కలిగిరి, కందుకూరు ప్రాంతాల నుంచి కావలికి వచ్చే వారికి మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

– చాకలికొండ శారద, సామాజిక మహిళా కార్యకర్త, కావలి

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



కావలికి సమీపంలో ఏర్పాటవుతున్న రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, వీటికి అనుబంధంగా ఏర్పాటయ్యే పరిశ్రమల ద్వారా కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా ద్వారా వేలాది మందికి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. భూముల ధరలు కూడా భారీగా పెరుగుతున్నాయి. రానున్న రోజుల్లో కావలి కేంద్రంగా భారీ ఆర్థిక వ్యవస్థ ఆవిష్కరణ జరగబోతోంది.

– కూనం తాతిరెడ్డి, డైరెక్టర్, సొసైటీ ఫర్ సోషల్ ఛేంజ్, కావలి

సేనకు టీడీపీ దూరం

- నెల్లూరు నగరంలో జనసేనతో కలిసి పనిచేసేందుకు పచ్చనేతలు ససేమిరా
- జనసేన నేతలను పట్టించుకోని మాజీ మంత్రి నారాయణ
- పార్టీలోనే కోవర్టును పెట్టి చీలిక తెచ్చిన వైనం
- నారాయణ తీరుపై గుర్రుమంటున్న జనసేన నాయకులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్రంలో టీడీపీ, జనసేనల మధ్య పొత్తు పొడిచినా నెల్లూరు నగరంలో మాత్రం ఆ రెండు పార్టీల కలయికకు పచ్చనేతలు ససేమిరా అంటున్నారు. రానున్న ఎన్నికల్లో జనసేనతో కలిసి ఎన్నికల సమరానికి వెళ్లేందుకు టీడీపీ నెల్లూరు నగర అభ్యర్థి పొంగూరు నారాయణ ఇష్టపడడం లేదని తెలుస్తోంది. ఎన్నికల ప్రచారానికి కూడా కేవలం టీడీపీ జెండాతోనే వెళుతున్నారు. ఓవైపు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మాత్రం టీడీపీ నేతలు అవమానించినా వారితో కలిసి పనిచేయాలని పిలుపునివ్వడంతో ఏం చేయాలో అర్థం కాక జనసేన నేతలు తలలు పట్టుకుంటున్నారు.

ఆశలు ఆవిరై..

జనసేన నెల్లూరు నగర సీటుపై మొదటి నుంచి ఆశలు పెంచుకుంది. జిల్లాలో జనసేన పార్టీ ఒంటరిగా పోటీ చేసే పరిస్థితి లేకపోవడంతో టీడీపీతో పొత్తు కుదిరితే నెల్లూరు సీటు తమకే వస్తుందని ఆ పార్టీ నేత మనుక్రాంత్‌రెడ్డి ఎంతగానో ఆశపడ్డారు. అందుకు తగినట్లుగానే పార్టీ కీలకనేత నాదెండ్ల మనోహర్‌తో సన్నిహితంగా మెలిగేవాడు. ఈ నేపథ్యంలో నెల్లూరు నగర సీటు టీడీపీ అధినేత చంద్రబాబు బినామీగా ఉన్న మాజీ మంత్రి పొంగూరు నారాయణకు ఓకే చేయడంతో జనసేన నేతల ఆశలపై నీళ్లు చల్లినట్టైంది. నారాయణ టీడీపీ–జనసేన ఉమ్మడి అభ్యర్థి అయినప్పటికీ జనసేన నేతలను పూచికపుల్లలా తీసేశాడు. నియోజకవర్గ పరిధిలో జరిగే ఏ కార్యక్రమాలకూ వారిని ఆహ్వానించడం లేదు. దీంతో జనసేన నేతలు నారాయణతో కలవలేక తమకు జరుగుతున్న అవమానాలకు మనస్సులోనే కుంగిపోతున్నారు. అవకాశం వచ్చినప్పుడు తామేంటో చూపిస్తామంటూ గుర్రుగా ఉన్నారు.

కోవర్టును పెట్టి..

మాజీ మంత్రి నారాయణ ఆది నుంచి జనసేనలో చీలిక తెచ్చేందుకు పావులు కదిపాడు. ఆ పార్టీలో తన కోవర్టును ఏర్పాటు చేసుకుని రెండు గ్రూపులుగా విడిపోయేలా చేశాడు. మనుక్రాంత్‌కు వ్యతిరేకంగా ఉన్న వర్గాన్ని కూడగట్టి పార్టీ నేతలను విడగొట్టేలా తన కోవర్టును ఉపయోగించాడు. అనుకున్నట్లే కోవర్టు ద్వారా మనుక్రాంత్‌ను దెబ్బతీశాడు. జిల్లాలో 'గ్లాసు'ను పట్టించుకోకుండా చేసి నారాయణ తన పంతం నెగ్గించుకున్నాడు.

స్కూల్లో టీచర్ అడిగితే ఐఏఎస్ అవుతానని చెప్పా



- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

నెల్లూరు(దర్గామిట్ట): ఓ విద్యార్థి చిన్నప్పుడు పాఠశాలలో క్లాస్ టీచర్ నువ్వేమవుతావ్ అని అడిగితే భయపడకుండా తాను ఐఏఎస్ అవుతానని చెప్పాడు. మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన అతను అదే స్ఫూర్తితో ఇష్టంగా చదివాడు. కోచింగ్ తీసుకునేందుకు ఆర్థిక స్తోమత లేక కేంద్ర ప్రభుత్వం ఏటా 50 మందికి ఉచితంగా సివిల్స్‌కి శిక్షణ ఇస్తుందని తెలుసుకుని అందులో ఎంపికై ఉచిత శిక్షణతోపాటు స్టైపెండ్ కూడా తీసుకున్నాడు. చివరికి ఐఏఎస్‌కు సెలెక్ట్ అయ్యాడు. ఆయనే ప్రస్తుతం నెల్లూరు జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా వచ్చిన సేతు మాధవన్. తన జీవిత ప్రయాణం ఆయన మాటల్లోనే..

మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చా

మాది తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా కందికుప్పం గ్రామం. మాది మధ్య తరగతి కుటుంబం. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యాభ్యాసం అక్కడే. కోయంబత్తూర్‌లో సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాను. అమ్మ గృహిణి. నాన్న నా 17వ ఏట మృతిచెందారు. అక్క, చెల్లి ఉన్నారు.

సర్టిఫికెట్ కోసం నెల రోజులు తిరిగాను

ఇంటర్మీడియట్ తరువాత డ్రైవింగ్ లైసెన్సు కోసం, ఒకానొక సందర్భంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం నెల రోజులపాటు కార్యాలయాల చుట్టూ తిరిగాను. అప్పుడే బలంగా నిర్ణయించుకున్నాను. ఐఏఎస్ అయి ప్రజలకు సేవ చేయాలనుకున్నాను. వెంటనే దినపత్రికల్లో వచ్చిన సివిల్స్ నోటిఫికేషన్ చూసి అడుగు ముందుకువేశా. ప్రభుత్వం ద్వారా ఉచిత శిక్షణ పొంది ఐఏఎస్ సాధించా.

కలాం, గాంధీజీ మాటలే ప్రేరణ

మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, మహాత్మాగాంధీల ఆటోబయోగ్రఫీ చదివాను. ఆ పుస్తకాలు నాలో మరింత స్ఫూర్తి నింపాయి. నా ఐఏఎస్ కల సాకారం చేసుకున్నాను. 2021లో అకాడమీలో పరిచయమైన శోభికతో వివాహమైంది. ప్రస్తుతం ఆమె పార్వతీపురం జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. తొలుత ప్రకాశం జిల్లాలో ట్రెయినీ కలెక్టర్‌గా చేశా. మార్కాపురం సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాను. రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖలో సీఈఓగా పనిచేస్తూ బదిలీపై నెల్లూరు జేసీగా బాధ్యతలు చేపట్టాను.

ప్రజలకు సేవ చేయడం అదృష్టం

ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా. జిల్లాలో రెవెన్యూ సమస్యలపై, పౌర సరఫరాల సంస్థ నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాను.

అభివృద్ధి పనులు ఏడాదిలో పూర్తి చేస్తాం

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఈ ఏడాది లోపు పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తామని విజయవాడ నుంచి వచ్చిన స్వచ్ఛభారత్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. నెల్లూరులోని రైల్వేస్టేషన్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు రైల్వేస్టేషన్‌ను మోడల్ స్టేషన్‌గా తయారు చేస్తున్నామని తెలిపారు.

భూలెక్క పక్కాగా..

ఒకప్పుడు ప్రతి గ్రామంలో భూ సమస్యలు సర్వసాధారణం. భూ పంపకాలు చేసుకోవాలన్నా పిల్లల పెళ్లిళ్లు, చదువుల కోసం విక్రయించాలన్నా.. చివరికి ఎవరికైనా దానం ఇవ్వాలన్నా ఇబ్బందే. వీటికి ఒకే సమాధానం భూముల రీసర్వే. ఎప్పుడో బ్రిటిష్ కాలంలో జరిగింది. ఆ తర్వాత దేశంలో ఎవరూ అంత సాహసం చేయలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మందుచూపుతో ఈ కార్యక్రమానికి సంకల్పించారు.

- వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకాన్ని చేపట్టిన ప్రభుత్వం
- దశాబ్దాల సమస్యలకు పరిష్కారం
- విజయవంతంగా కొనసాగుతున్న రీసర్వే
- 327 గ్రామాల్లో ఆర్‌ఓఆర్‌లు (రికార్డ్ ఆఫ్ రైట్స్) సిద్ధం



రాపూరు మండలం సిద్ధవరంలో హద్దు రాయిని పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్ (ఫైల్)



నెల్లూరు(దర్గామిట్ట): దేశంలో ఎక్కడా లేని విధంగా తొలిసారిగా రాష్ట్రంలో వైఎస్సార్ జగనన్న శాస్వత భూ హక్కు, భూరక్ష పథకాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా భూముల రీసర్వే చేపట్టారు. జిల్లాలో ఈ కార్యక్రమం అమలుపై కలెక్టర్ ఎం.హరినారాయణన్ ప్రత్యేక దృష్టి సారించారు. సర్వే పటిష్టంగా, సమగ్రంగా జరిగేలా ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించారు. దీంతో ఇప్పటి వరకు సుమారు 9,700 సరిహద్దు వివాదాలు సమస్యలు పరిష్కారమైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. భూ వివాదాలు, సరిహద్దు సమస్యలు, మ్యుటేషన్లు, సబ్ డివిజన్లు, నిషేధిత ఆస్తులు, వారసత్వం వంటి ఎన్నో చిక్కుముడులకు రీసర్వే సమాధానం చెబుతోంది. ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారం కాని సమస్యలకు సర్వే బృందాలు చెక్ పెడుతున్నాయి.

అందుబాటులోకి..

జిల్లాలో తొలిదశలో 327 గ్రామాల్లో రీసర్వే పూర్తయింది. రెండో దశ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పూర్తయిన చోట్ల డిజిటల్ రికార్డులు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి భూకమతాన్ని కొలిచి అక్షాంశ, రేఖాంశాలతో హద్దులను సర్వే బృందాలు నిర్ధయించాయి. ప్రభుత్వ ఖర్చులతోనే సర్వే రాళ్ల ఏర్పాటు చేశారు. ప్రతి రైతుకు భూ హక్కు పత్రం అందజేస్తున్నారు. వారి భూములకు సంబంధించి ఆధార్‌లాగే ఒక విశిష్ట సంఖ్య (యూనిక్ కోడ్) కేటాయించారు. భూ హక్కు పత్రంలోనే క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. దానిని స్కాన్ చేసి వివరాలను ఎప్పుడైనా తెలుసుకునే అవకాశం కల్పించారు.

డ్రోన్ సర్వే పూర్తి

జిల్లాలో ఎంపిక చేసిన 730 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేశారు. బృందంలో సర్వేయర్, వీఆర్వో, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఉన్నారు. వారు ఏదైనా ఊరికి వెళ్లే ముందు దండోరా వేయించి ప్రజలకు వివరాలు తెలియపరుస్తున్నారు. సర్వే సమయంలో పూర్తి డాక్యుమెంట్లను రైతులు వారికి అందించి సమస్యలను పరిష్కరించుకుంటున్నారు.

పట్టాదారు పాసుపుస్తకాలకు స్వస్తి

ఇప్పటి వరకు పూర్వీకుల నుంచి వచ్చిన పాసుపుస్తకాలు, ప్రస్తుతం ఉన్న వాటికి స్వస్తి పలకనున్నారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో బార్ కోడింగ్‌తో కలిగిన భూహక్కు పత్రం రైతులకు జారీ చేయడం జరుగుతోంది. దీంతో భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం కావడంతోపాటు పరిశీలన మరింత సులభతరం కానుంది.

జిల్లాలో ఇలా..

గ్రామాలు	737
డ్రోన్ సర్వే చేపట్టిన గ్రామాలు	730
ఓఆర్ఐ పూర్తయినవి	569
షేప్ ఫైల్స్ పూర్తయినవి	328
గ్రౌండ్ ట్రూతింగ్ ధ్రువీకరించినవి	347
13వ నోటిఫికేషన్ పూర్తయినవి	328
ఎన్ని సరిహద్దు వివాదాలను పరిష్కరించారంటే..	9,700 కు పైగా..

ప్రతిష్టాత్మకంగా రీసర్వే



దేశంలో వందేళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే భూముల రీసర్వే జరుగుతోంది. దీనిని ఎన్నో రాష్ట్రాలు మోడల్‌గా తీసుకుంటున్నాయి. సర్వే కోసం అత్యాధునిక టెక్నాలజీ వినియోగిస్తున్నాం. గ్రామాలకు బృందం వచ్చినప్పుడు రైతులు సహకరించాలి.

– అన్నవరం హనుమాన్ ప్రసాద్, ఏడీ సర్వే, నెల్లూరు



సమస్యలు ఉండవు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే వల్ల గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు ఉండవు. హద్దులు తెలిపి రాళ్ల కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇది మంచి పథకం.

– గడ్డం శ్రీనివాసులురెడ్డి, నువ్వూరుపాడు

సహకార బ్యాంకులకు పూర్వ వైభవం



చెక్కును అందజేస్తున్న మంత్రి కాకాణి, చైర్మన్ సత్యనారాయణరెడ్డి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో సహకార బ్యాంకులకు పూర్వ వైభవం వచ్చిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. 200 మంది కేంద్ర సహకార బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన గ్రాట్యూటీ బకాయి రూ.1.05 కోట్ల చెక్కును నెల్లూరులోని డైకస్ రోడ్డులో ఉన్న క్యాంప్ కార్యాలయంలో మంత్రి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో బకాయిలను విడుదల చేసి రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నష్టాల ఊబిలో కూరుకుపోయిన సహకార బ్యాంకును సీఎం లాభాల బాట పట్టించారన్నారు. అవి రైతులకు విస్తృతంగా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

దశాబ్దాల సమస్యకు పరిష్కారం

దశాబ్దాలుగా ఉన్న సమస్యకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కారం చూపించారని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అన్నారు. బ్యాంకు అభివృద్ధికి మంత్రి కాకాణి సహకారం మరువలేనిదన్నారు. అనంతరం ప్రాథమిక సహకార సంఘాలకు సంబంధించి ఉద్యోగులకు కొత్త వేతన స్కేల్ అమలు చేస్తూ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. రిటైర్డ్ ఉద్యోగులు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ మంత్రి, చైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీఈఓ శ్రీనివాసరావు, డీజీఎంలు దయాకర్‌రెడ్డి, మధుసూదన్, డైరెక్టర్లు నర్మల రమణయ్య, లక్ష్మీప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 120	బ్రాయిలర్	
లేయర్ (లైవ్)	: 73	స్కిన్‌లెస్	: 240
బ్రాయిలర్ చికెన్	: 214	లేయర్ చికెన్	: 125

క్లుప్తంగా

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం



మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

చీమకుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలో మహిళలకు 14వ రాష్ట్రస్థాయి సీనియర్ హాకీ పోటీలను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఇవి 10వ తేదీ వరకు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజున రాష్ట్రస్థాయి హాకీ పోటీలు తన అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

కోవూరు: మండలంలోని కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం రాష్ట్రస్థాయి పురుషుల కబడ్డీ పోటీలు మొదలయ్యాయి. వీటిని డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, జెట్పీటీసీ సభ్యురాలు కవరగిరి శ్రీలత, కబడ్డీ అసోసియస్ రాష్ట్ర కార్యదర్శి పద్మజబాల, జల్‌జీవన్ మిషన్ చైర్మన్ గోపిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కబడ్డీ ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.లవకుమార్, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీప్రసన్న, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జూగుంట విజయానందం, ఉపాధ్యక్షుడు జాన్సన్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

నెల్లూరు(క్రైమ్): భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై కూలీ మృతిచెందాడు. ఈ ఘటన నెల్లూరు వేదాయపాళెంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ముకుందరావు (32), అనూష దంపతులకు కౌషిక్, సాయి అనే కుమారులున్నారు. కొన్నేళ్ల నుంచి దంపతులు కూలీ పనులు చేసుకుంటూ కోవూరులో నివాసం ఉంటున్నారు. శుక్రవారం ముకుందరావు తనతోటి కూలీలతో కలిసి వేదాయపాళెంలో భవన నిర్మాణ పనులకు వెళ్లాడు. సెల్లార్‌లో సపక కర్రకు ఉన్న కరెంట్ వైరును తప్పించే క్రమంలో ముకుందరావు షాక్‌కు గురయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడికి వైద్యసేవల నిమిత్తం ఆస్పత్రికి తరలించేందుకు సహచరులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ముకుందరావును పరీక్షించి మృతిచెందాడని నిర్ధారించారు. కుటుంబసభ్యులకు విషయాన్ని తెలియజేశారు. అనూష పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.80
సన్నవి : రూ.65
పండ్లు : రూ.27

చంద్రబాబును నమ్మి మోసపోవద్దు

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

కోవూరు: 'తెలుగుదేశం పార్టీకి ఓట్లేస్తే ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు ఆగిపోయాయి. చంద్రబాబు నాయుడిని నమ్మి మోసపోవద్దు' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా విడవలూరు మండలంలోని రామచంద్రాపురం పాతూరులో శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మత్స్యకార గ్రామాల్లో కుటుంబ సమేతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు జీవితమంతా కుట్రలు, మోసాలతోనే సాగిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను చూసి ఆయనకు మతిపోయిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మత్స్యకారులకు వేట విరామ సమయంలో రూ.4 వేలిస్తే.. ఆ మొత్తం దేనికీ ఉపయోగపడేది కాదన్నారు. నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మత్స్యకార భరోసా పేరుతో రూ.10 వేల చొప్పున ఇచ్చిందన్నారు.

గుణపాఠం చెప్పాలి

త్వరలో జరిగే ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ డబ్బు సంచులతో వస్తున్నారని ప్రసన్న తెలిపారు. వారికి సరైన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కరోనా సమయంలో వారిద్దరూ ప్రజలను పట్టించుకోలేదన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారులు, నాయకులు ప్రజానీకానికి అండగా నిలబడ్డారన్నారు. బాబును ఆర్థిక నేరస్తుడిగా అందరూ గుర్తించాలన్నారు. రెండు ఎకరాల నుంచి రూ.4 లక్షల కోట్లకు అధిపతి ఎలా అయ్యాడో తెలియజేయాలన్నారు. సంక్షేమ క్యాలెండర్ ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేశారన్నారు. ఆయనకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, నల్లపరెడ్డి గీతమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, జొన్నవాడ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, వవ్వేరు బ్యాంక్ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఏపీఎల్డీఏ చైర్మన్ విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా లోకానికి అండగా జగన్ ప్రభుత్వం

- నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న రూరల్ సమన్వయకర్త ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు(దర్గామిట్ట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మహిళా లోకానికి అండగా నిలిచారని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు, కార్పొరేటర్ మొయిళ్ల గౌరి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి, సిటీ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్ తదితరులు హాజరయ్యారు. పలువురు మహిళా ప్రజాప్రతినిధులను, వివిధ రంగాలకు చెందిన వారిని ప్రభాకర్‌రెడ్డి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ రెట్టింపు చైతన్యంతో మహిళలు రాజకీయాల్లోకి రావాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. అనంతరం జర్నలిస్టు ధనలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు దాసరి అమృత, కువ్వాకొల్లు విజయలక్ష్మి, సయ్యద్ మొబీనా, కామాక్షమ్మ, మూలే విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ మొయిళ్ల సురేష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

- నెల్లూరు సిటీ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్



ప్రచారం చేస్తున్న ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ చేరాయని వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ సమన్వయకర్త ఎండీ ఖలీల్ అహ్మద్ తెలిపారు. నగరంలోని 53వ డివిజన్ వారధి సెంటర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ సామాన్య కార్యకర్తనైన తనకు జగనన్న ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించారన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధితో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రచారం చేస్తున్న సమయంలో ఈ విషయం స్పష్టంగా తెలుస్తోందన్నారు. వారంతా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. నెల్లూరు నగరంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ జమీర్, నాయకులు బాగి వెంకటరమణ, వెంగళ్‌రెడ్డి పాల్గొన్నారు.